సాక్షి ఏలూరు

బుధవారం । 18 । అక్టోబర్ । 2023



అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఉందని ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. IIలో ▸



పసిడి పరుగులు

ఇజ్రాయెల్ యుద్ధం ప్రభావంతో బంగారం ధరలు జోరు మీదున్నాయి. ధరలు ఇప్పట్లో తగ్గే అవకాశం కనిపించడం లేదు. ప్రస్తుతం ఆల్‌టైం హైలో కొనసాగుతున్నాయి. IIలో ▸



హ్యాండ్‌బాల్‌లో సత్తా

కడపలోని జరిగిన హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమ సీనియర్ మహిళల, బాలుర జట్లు సత్తా చాటాయి. వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. IIలో ▸

న్యూస్‌రీల్

మళ్లీ పరీక్షలు రాసేలా అవగాహన కల్పించండి



జూనియర్ కళాశాలల ప్రతినిధులకు సూచనలిస్తున్న ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంటర్ ఫెయిలైన విద్యార్థులతో తిరిగి పరీక్షలు రాయించేలా సంబంధిత కళాశాలల ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ఇంటర్మీడియట్ ప్రాంతీయ తనిఖీ అధికారి కే.చంద్రశేఖర బాబు, జిల్లా వృత్తి విద్యా అధికారి బీ.ప్రభాకర రావు ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలోని అన్ని కళాశాలల యాజమాన్యాలకు తగిన సూచనలిచ్చారు. 2021-22, 2022-23 విద్యా సంవత్సరాల్లో ఫెయిలైన విద్యార్థులు తిరిగి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో చేరి రెగ్యులర్ విద్యార్థిగా మారే అవకాశం ఇంటర్మీడియట్ బోర్డు కల్పించిందన్నారు. వచ్చే మార్చిలో జరిగే పరీక్షలకు హాజరయ్యేందుకు ఆయా విద్యార్థులకు అవకాశం కల్పించారన్నారు. గత రెండు విద్యా సంవత్సరాల్లో ఫెయిలైన విద్యార్థుల వివరాలను తీసుకుని వారిని, వారి తల్లిదండ్రులను నేరుగా సంప్రదించి పరీక్ష ఫీజులు చెల్లించేలా సంబంధిత కళాశాలల అధ్యాపకులు, ప్రిన్సిపాల్స్ కృషి చేయాలన్నారు.

దూరవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు గడువు పొడిగింపు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యంలో దూరవిద్యా విధానంలో నిర్వహించే 10వ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలకు గడువు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పీ.శ్యామ్ సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అభ్యర్థులు ఈ నెల 31 వరకూ ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఆన్‌లైన్ ద్వారా ప్రవేశాలు పొందవచ్చన్నారు.

ఈవీఎంల చెకింగ్ ప్రక్రియ పరిశీలన

ఏలూరు(మెట్రో): జిల్లాకు కేటాయించబడిన ఈవీఎంలు, వీవీ ప్యాట్స్‌ల ఫస్ట్ లెవెల్ చెకింగ్‌కు నియమించిన అధికారులు, సిబ్బంది వారికి ఇచ్చిన గుర్తింపు కార్డును తప్పనిసరిగా ధరించాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఫస్ట్ చెకింగ్ రెండో రోజైన మంగళవారం కలెక్టర్ గోడౌన్‌లో నిర్వహిస్తున్న చెకింగ్ ప్రక్రియను పరిశీలించారు. ముందుగా సిబ్బంది హాజరు పట్టికను, సెక్యూరిటీగా విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది హాజరుపట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎట్టి పరిస్థితుల్లోను ఐడీ కార్డులు లేకుండా కేంద్రానికి రావద్దన్నారు. గోడౌన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని ఆదేశించారు.

ఆర్టీసీ స్థలాల లీజుపై 19న సదస్సు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆర్టీసీ విజయవాడ జోన్ పరిధిలోని వివిధ బస్ స్టేషన్లలో ఉన్న 36 ఖాళీ స్థలాలను 15 సంవత్సరాల కాలపరిమితికి లీజుకు ఇవ్వడానికి టెండర్లు ఆహ్వానించిన నేపథ్యంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఈ నెల 19వ తేదీన అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లా ద్వారకా తిరుమలలో ఒకటి, కొయ్యలగూడెంలో ఒక బిట్, కలిదిండిలో 2 బిట్లు, కైకలూరులో 2 బిట్లు, పశ్చిమ గోదావరి జిల్లాలో భీమవరం ఆర్టీసీ స్టాఫ్ క్వార్టర్స్ స్థలం, ఆకివీడులో ఒక బిట్, మార్టేరులో ఒక బిట్‌కు టెండర్లను ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ టెండర్ల ప్రక్రియలో టెండర్లు ఎలా దాఖలు చేయాలో, స్థలాలను ఎలా లీజుకు దక్కించుకోవాలో, లీజుకు పొందే స్థలాలలో ఏవిధంగా వ్యాపారాలు చేసుకోవాలో అవగాహన సదస్సులో వివరిస్తారని తెలిపారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో అవగాహన సదస్సు జరుగుతుందని తెలిపారు.

డీఈఎల్ఈడీ ఫలితాల వెల్లడి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గత ఆగస్టులో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో నిర్వహించిన డీఈఎల్ఈడీ ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయని జిల్లా విద్యాశాఖాధికారి పీ.శ్యామ్ సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థుల డమ్మీ మార్కుల మెమోలు బీఎస్ఈ ఏపీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. అభ్యర్థులు రీకౌంటింగ్‌కు సబ్జెక్టుకు రూ.500 సీఎఫ్ఎంఎస్ చలానా ద్వారా చెల్లించాలని, రీకౌంటింగ్ దరఖాస్తుతో పాటు సీఎఫ్ఎంఎస్ చలానా, డమ్మీ మార్కుల మెమో, స్వంత చిరునామా ఉన్న కవర్‌ను నేరుగా విజయవాడ గొల్లపూడిలోని ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయానికి పంపాలన్నారు.

ఈ-క్రాప్‌తో దళారులకు చెక్

- జిల్లాలో 100 శాతం పూర్తయిన నమోదు
- పంటకు మద్దతు ధర లభించేలా చర్యలు
- 99 శాతం ఈ-కేవైసీ పూర్తి



ఈ- క్రాప్ నమోదు చేస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు

ఏలూరు(మెట్రో): రైతన్నల సంక్షేమమే పరమావధిగా భావిస్తున్న రాష్ట్ర సర్కారు పండించిన పంటకు ఎలాంటి ఢోకా లేకుండా చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా దళారులకు చెక్ పెట్టేందుకు, రైతులకు అన్ని సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

దీనిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఈ-క్రాప్ నమోదు చేస్తున్నారు. ఈ-క్రాప్ పేరుతో పంటల నమోదు కార్యక్రమాన్ని చేపట్టి రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర వచ్చేలా చూస్తున్నారు. ఈ క్రాప్ నమోదు ద్వారా అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. ఈ-క్రాప్ నమోదు, వెబ్‌ల్యాండ్ వివరాల ఆధారంగా ఏ పంట ఎంత విస్తీర్ణంలో పండిస్తున్నారు.. ఎంత దిగుబడి వస్తుందనేది ముందుగానే అంచనా వేస్తూ దానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం మార్కెటింగ్ సదుపాయాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకుంది.

పొలాలకు వెళ్లి పంట నమోదు

జిల్లా వ్యాప్తంగా 27 మండలాల్లో 4,78,379.1 ఎకరాలకు 1,33,357 మంది రైతులు ఉండగా, మొత్తం ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకున్నారు. పంటల నమోదు చేస్తూనే రైతుల నమోదు ప్రక్రియను సైతం జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు పూర్తి చేస్తున్నారు. ఏ ఒక్క రైతును విడిచిపెట్టకుండా రైతు భరోసా కేంద్రాల వారీగా ఈ క్రాప్ నమోదు ప్రక్రియ చేపట్టారు. రైతులు సాగు చేసే పొలాలకు గ్రామ వ్యవసాయ శాఖ సహాయకులు నేరుగా వెళ్లి అక్కడే వారి ఫోటోలు తీసి ఈ-క్రాప్ ప్రక్రియను పూర్తిచేశారు. ప్రస్తుతం వ్యవసాయ శాఖ అధికారులు రైతు భూమి వద్దకు చేరుకుని అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా ఈక్రాప్ నమోదు ప్రక్రియను చేపడుతున్నారు. ఈ ఏడాది మే1న ప్రారంభించిన ఈ క్రాప్ నమోదు ప్రక్రియ ఈ నెల 10 వరకు చేపట్టారు. ఈ ప్రక్రియలో జిల్లా వ్యాప్తంగా ప్రతి ఎకరాకు ఈ-క్రాప్ ప్రక్రియను పూర్తి చేశారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

ఈ-క్రాప్ నమోదు చేయించుకున్న ప్రతి రైతు ఈకేవైసీ చేయించుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ-కేవైసీ చేయించుకోకపోతే పంటలు విక్రయించే సమయంలో ప్రకృతి విపత్తుల సమయంలో, పంటలు రుణాలు పొందే సమయంలో ఇబ్బందులు పడాలి. ఈ ఇబ్బందులు తొలగించేందుకు ఈ-క్రాప్ పూర్తి చేసిన ప్రతి రైతుతో ఈ-కేవైసీ పూర్తి చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

ఈ-క్రాప్‌తో లాభాలు

ఈ-క్రాప్‌తో రైతులు పంట నష్టం సంభవించినప్పుడు బీమా వర్తించేందుకు, ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు వడ్డీ రాయితీ, రైతు భరోసా , పీఎం కిసాన్, వైఎస్సార్ యంత్ర సేవ వంటి పథకాలన్నీ వర్తిస్తుండటంతో పాటుగా కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకే పంటలు విక్రయించుకునే సదుపాయం ఏర్పడుతుంది. పంటలు దళారుల చేతుల్లో పెట్టి రైతన్నలు మోసపోకుండా నేరుగా దళారులకు చెక్ పెట్టి పంటలను విక్రయించుకునే అవకాశం లభిస్తుంది.

100 శాతం పూర్తి చేశాం



జిల్లా వ్యాప్తంగా రైతులు ఈ-క్రాప్, ఈ-కేవైసీ చేయించుకోవడం ద్వారా రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఈ-క్రాప్ 100 శాతం పూర్తి కాగా, ఈ -కేవైసీ 99.04 శాతం వ్యవసాయాధికారులు పూర్తిచేశారు. ఈ-క్రాప్, ఈ-కేవైసీతో రైతులు మోసపోకుండా అడ్డుకోవచ్చు.

– బి.లావణ్యవేణి, జిల్లా జాయింట్ కలెక్టర్

స్పోర్ట్స్ కిట్‌లను పరిశీలించిన కలెక్టర్



ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం స్పోర్ట్స్ కిట్‌లు పరిశీలిస్తున్న కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): క్రీడల పట్ల యువతను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం డిసెంబరులో రాష్ట్ర మంతటా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేసినట్లు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి సంబంధించి ఏలూరు జిల్లాకు వచ్చిన స్పోర్ట్స్ కిట్స్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యువతను క్రీడలలో ప్రోత్సహించడానికి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో విస్తృతంగా చర్యలు చేపట్టామని.. ఇందులో భాగంగా డిసెంబరులో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి స్పోర్ట్స్ కిట్స్‌ను అందజేస్తావ ఎన్నారు. కార్యక్రమంలో క్రీడా చీఫ్ కోచ్ బి.శ్రీనివాసరావు, కోచ్ పి.ఉదయ్‌కిరణ్, జిల్లా కార్యదర్శి కె.అలివేలుమంగ తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు

ఎస్పీ డి. మేరీ ప్రశాంతి



పోలవరం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ డి.మేరీ ప్రశాంతి

పోలవరం రూరల్: మహిళల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఎస్పీ డి.మేరీ ప్రశాంతి అన్నారు. పోలవరం పోలీస్‌స్టేషన్‌ను ఆమె మంగళవారం సందర్శించి స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. స్టేషన్‌లో నమోదవుతున్న కేసుల వివరాలు, వాటి పరిష్కారంపై సీఐ కె.వి జయబాబు, ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్‌లు ఎస్పీకి వివరించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదిదారులతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. స్టేషన్ సిబ్బంది పనితీరుపై ఆరా తీసి సిబ్బంది సమస్యలను కూడా స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ మహిళల పట్ల అమానుషంగా దాడులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఏలూరు జిల్లాలో మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు పోలీసు యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉంటుందన్నారు. ఎవరైనా దాడులకు పాల్పడితే వారిని అరెస్టు చేయడంతో పాటు కోర్టు ద్వారా కఠినంగా శిక్షిస్తామన్నారు. జిల్లాలో గంజాయి అమ్మకాలు, రవాణా మూలాలపై గట్టి నిఘా పెట్టామన్నారు. గంజాయి విషయంలో కూకటి వేళ్లతో తొలగించే విధంగా ప్రయత్నిస్తున్నామన్నారు. సారా తయారీ అమ్మకాల విషయంలో ఎస్ఈబీ ద్వారా ఎప్పటికప్పుడు దాడులు నిర్వహిస్తూ నియంత్రిస్తున్నామన్నారు. నేరాలు చేయాలన్నా భయపడే విధంగా పోలీసు యంత్రాంగం పనిచేస్తోందన్నారు. యువత చెడు వ్యసనాల బారి పడకుండా సిబ్బంది ద్వారా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నేరాలకు తావులేకుండా అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పోలవరం పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందిని కొరతను తీర్చేలా త్వరలో భర్తీ ప్రక్రియ చేపడతామన్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని



ఎమ్మెల్యే నాని చేతుల మీదుగా ఇళ్ల పట్టాలు అందుకుంటున్న లబ్ధిదారులు

ఏలూరు టౌన్: ఏలూరు నియోజకవర్గంలోని ప్రతి పేదవాడికి మేలు చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో పేదల జీవితాల్లో సంతోషాలు వెల్లివిరియాలని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని చెప్పారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో పేదలకు ఇళ్ల పట్టాలను ఆయన చేతులమీదుగా పంపిణీ చేశారు. ఏలూరు నగరంలోని 28వ డివిజన్ బీడీ కాలనీ అంబికానగర్‌కు చెందిన 61 మందికి, 49వ డివిజన్ లునానీనగర్‌కు చెందిన 56 మంది.. మొత్తం 117మంది లబ్ధిదారులకు ఇళ్ళ పట్టాలను ఎమ్మెల్యే నాని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో పేదలకు అండగా నిలబడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. పేద వర్గాలకు కూడు, గూడు, విద్య, వైద్యం ఉచితంగా అందించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక ప్రణాళికతో పనిచేస్తున్నారని తెలిపారు. ఎన్నో ఏళ్ళుగా స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్న పేదలకు నివాస స్థలంపై శాశ్వత హక్కు కల్పించడమే కాకుండా, అర్హులైన లబ్ధిదారులందరికీ ఇళ్ళ నిర్మాణాలకు రూ.1.80 లక్షలు ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. రానున్న వేసవిలోగా ఇళ్ళ నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా లబ్ధిదారులంతా ఎమ్మెల్యే ఆళ్ల నానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఏలూరులో పేదల పక్షపాతిగా నిలుస్తూ తమలాంటి వేలాదిమంది పేదలకు ఇళ్ల పట్టాలు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎంఆర్ పెదబాబు, జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, కార్పొరేటర్ దేవరకొండ శ్రీనివాసరావు, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, ఏలూరు తహసీల్దార్ సోమశేఖర్, నాయకులు కొల్లిపాక సురేష్, కొలికిపాముల తిరుపతిరావు, యర్రా కిరణ్, దొడ్డిపట్ల రత్నం, పలువురు కార్పొరేటర్లు, నాయకులు ఉన్నారు.

అన్నపూర్ణా పాహిమాం



జంగారెడ్డిగూడెం : గాయత్రీదేవి అలంకరణలో జంగారెడ్డిగూడెం నూకాలమ్మ అమ్మవారు

వాడవాడలా శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజు అమ్మవారు అన్నపూర్ణదేవిగా, గాయత్రీ దేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- సాక్షి, నెట్‌వర్క్



ద్వారకాతిరుమల : అన్నపూర్ణా దేవిగా భక్తులకు దర్శనమిచ్చిన కుంకుళ్లమ్మ వారు

మాతాశిశు మరణాల నివారణకు కృషి



జీలుగుమిల్లిలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): మాతాశిశు మరణాల నివారణే లక్ష్యంగా గర్భిణుల్లో రక్తహీనత నివారణకు అక్షజ కార్యక్రమం చేపట్టినట్లు అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ తెలిపారు. జీలుగుమిల్లి మండల పరిషత్ కార్యాలయంలో అక్షజ కార్యక్రమంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో గర్భిణులు రక్తహీనత వల్ల డెలివరీ సమయంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ పరిస్థితులను అధిగమించేలా రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టారని తెలిపారు. ఏలూరు సెయింట్ థెరిసా మహిళా కళాశాల, మార్పు సేవా సంస్థల సహకారంతో అక్షజ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ బుట్టాయగూడెంలో ప్రారంభించారని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గర్భిణిల్లో రక్తహీనత నివారణకు 6 నెలల పాటు పౌష్టికాహార కిట్‌లు అందజేయనున్నట్లు ఐసీడీఎస్ పీడీ విజయలక్ష్మి, సెయింట్ థెరిసా కళాశాల ప్రిన్స్‌పాల్ పద్మజలు తెలిపారు. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, టి.నర్సాపురం మండలాల్లో న్యూట్రిషన్ పైలట్ ప్రాజెక్టుగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించాలి



మున్సిపల్ కమిషనర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): జిల్లాలోని అన్ని పురపాలక సంఘాల్లోని పారిశుధ్య కార్మికులకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్య పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మునిసిపల్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం సాయంత్రం పురపాలక సంఘాల కమిషనర్లతో కలెక్టర్ వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సఫాయి కర్మచారి చట్టం కింద పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణ బాధ్యత అధికారులపై ఉందన్నారు. వారికి ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ ప్రాంతాలలో పూర్తి పారిశుధ్య పరిస్థితులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య కార్మికులకు అవసరమైన చెప్పులు, రెయిన్ కోట్లు, వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పారిశుధ్య కార్మికులకు ఈఎస్ఐ కార్డులు అందించే విషయాన్ని పరిశీలించాలని, పెండింగ్ లో ఉన్న హెల్త్ అలవెన్సు అందించాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పురపాలక సంఘాల్లోని ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆరోగ్య సురక్షా క్యాంపులకు ఆ ప్రాంతంలోని ప్రతి ఒక్కరూ హాజరయ్యేలా వలంటీర్లు, ఏఎన్ఎంలు చర్యలు తీసుకోవాలన్నారు. డయాబెటీస్, రక్తపోటు, రక్తహీనతకు సంబంధించి పరీక్షలు నిర్వహించాలని, పరీక్షలలో ఏదైనా దీర్ఘకాలిక రోగాలు గుర్తిస్తే వెంటనే నెట్‌వర్క్ ఆసుపత్రులకు తరలించి, మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, నూజివీడు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి కమిషనర్లు అబ్దుల్ రషీద్, భవానీ ప్రసాద్, రాంబాబు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డా.శర్మిష్ఠ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి భద్రత



వీవర్స్‌కాలనీలో జగనన్న ఆరోగ్య సురక్షలో మాట్లాడుతున్న చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: ప్రజల ఆరోగ్య భద్రతను పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుందని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు చెప్పారు. పట్టణంలోని 24, 25, 26, 27 వార్డులకు సంబంధించి మంగళవారం పట్టణంలోని వీవర్స్‌కాలనీ పాఠశాల వద్ద నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష పేరుతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. శిబిరంలో ప్రజలతో ముదునూరి మాట్లాడి, వారి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, కౌన్సిలర్లు కావలి నాని, యర్రా ఉమ, మల్లాడి బుజ్జి, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే నరసాపురం మండలం సీతారామపురం నార్త్ గ్రామ సచివాలయం వద్ద మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ముదునూరి పాల్గొని మాట్లాడారు. గ్రామ స్థాయిలో నిపుణులైన వైద్యులతో వైద్య సేవలందించడం దేశ చరిత్రలో ప్రథమమన్నారు. మొగల్తూరు కుక్కలవారితోట నెంబర్ 3 వద్ద మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ముదునూరి సందర్శించారు.

నరసాపురం, కాకినాడ నుంచి ప్రత్యేక రైళ్లు

నరసాపురం: దసరా రద్దీని దృష్టిలో పెట్టుకుని మరో 3 రైళ్లను సికింద్రాబాద్‌కు నడుపుతున్నారు. ఒకటి నరసాపురం నుంచి నేరుగా సికింద్రాబాద్‌కు కాగా, మరో రెండు రైళ్లు కాకినాడ సికింద్రాబాద్ మధ్య నడుస్తాయని నరసాపురం రైల్వేస్టేషన్ మేనేజర్ దివాకర్ బాబు చెప్పారు. 07270 సర్వీస్ నెంబర్‌తో ఈనెల 19న సాయంత్రం 6 గంటలకు నరసాపురం నుంచి బయలుదేరి మరుసటిరోజు ఉదయం 4.50 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. 07271 సర్వీస్ నెంబర్‌తో ఈనెల 20న సికింద్రాబాద్‌లో రాత్రి 9 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 8 గంటలకు కాకినాడ చేరుకుంటుంది. 21న 07272 నెంబర్‌తో రాత్రి 8 గంటలకు కాకినాడలో బయలుదేరి మరుపటిరోజు ఉదయం 8.30 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుందని చెప్పారు.

29న మిస్టర్ ఆంధ్రా పోటీలు

సాక్షి, భీమవరం: భీమవరం పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయ కల్యాణ మండపంలో ఈనెల 29న మిస్టర్ ఆంధ్రా బాడీబిల్డింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు బాడీబిల్డింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కఠారి రవిశంకర్, షేక్ ఖాసిం చెప్పారు. దీనికి ఈ నెల 22న పట్టణంలోని కే 12 జిమ్‌లో జిల్లా టీం సెలక్షన్స్ నిర్వహిస్తామన్నారు. బాడీబిల్డర్స్, ఫిజిక్ మోడలింగ్, మాస్టార్స్, దివ్యాంగులు పాల్గొనవచ్చునన్నారు. ఇతర వివరాలకు 62813 33159 నెంబరులో సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

28, 29 తేదీల్లో ర్యాపిడ్ రేటింగ్ చెస్ టోర్నీ

సాక్షి, భీమవరం: జిల్లా చెస్ అసోసియేషన్, యూత్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమవరంలో ఈనెల 28, 29 తేదీల్లో ఇంటర్నేషనల్ ర్యాపిడ్ రేటింగ్ ఫైడ్ చెస్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ చెప్పారు. టోర్నమెంట్‌కు సంబంధించిన వివరాలను మంగళవారం విలేకర్లకు వెల్లడించారు. రూ.5 లక్షల ప్రైజ్‌మనీతో నిర్వహించే ఈ పోటీలకు ఇప్పటికే వివిధ రాష్ట్రాలకు చెందిన 110 మంది క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. ఇతర వివరాల కోసం 90632 24466 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని కిషోర్ తెలిపారు.

చికిత్స పొందుతూ రిటైర్డ్ హెచ్‌ఎం మృతి


కాటిక మోషేన్ (ఫైల్)

భీమడోలు: ఇంట్లోకి బైక్ ఎక్కిస్తుండగా ప్రమాదవశాత్తు జారి పడగా తీవ్ర గాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రిటైర్డ్ హెచ్‌ఎం మంగళవారం మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. పోలసానిపల్లిలో నివాసం ఉంటున్న రిటైర్డ్ హెచ్‌ఎం కాటిక మోషేన్ (63) ఇరవై రోజుల క్రితం ఇంట్లో బైక్‌ను ఎక్కిస్తుండగా ఇంజిన్ ఆగి ప్రమాదవశాత్తు జారి పడటంతో తలకు తీవ్ర గాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వెంటనే ఆయనను విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. పరిస్థితి విషమించడంతో విజయవాడలోని ప్రభుత్వ ఆసుపత్రికి సోమవారం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. భీమడోలు హెచ్‌సీ సూరిశెట్టి శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

జంగారెడ్డిగూడెం: స్థానిక జాతీయ ప్రధాన రహదారిపై బైనేరు వంతెన సమీపంలో మంగళవారం రాత్రి లారీ ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. పోలవరం మండలం గూటాలకు చెందిన తోట వీర వెంకట సత్యనారాయణ (34) తాపీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. దసరా సెలవుల నేపథ్యంలో భార్య, ఇద్దరు కుమార్తెలతో కలిసి తిరుమలాపురంలో అత్తారింటికి వచ్చాడు. మంగళవారం తిరుమలాపురం నుంచి జంగారెడ్డిగూడెంకు బైక్‌పై వెళ్లి రాత్రి తిరిగి బయలుదేరాడు. బైనేరు బ్రిడ్జి సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీ ఇతనిని ఢీకొంది. ఈ ప్రమాదంలో సత్యనారాయణ ఘటనా స్థలంలో మృతి చెందాడు. ఎస్సై మల్లికార్జునరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

పండుగల వేళ.. పసిడి పరుగులు

- 24 క్యారెట్లు 10 గ్రాములు రూ.61 వేలకు చేరిన ధర
- కేజీ రూ.72 వేలు పలుకుతున్న వెండి
- భారీగా తగ్గిన కొనుగోళ్లు.. ఇజ్రాయెల్ యుద్ధ ప్రభావం


నరసాపురంలో ఓ జ్యూయలరీ షాపు


బంగారు ఆభరణాలు

నరసాపురం: ఇజ్రాయెల్ యుద్ధం ప్రభావంతో బంగారం ధరలు ఆకాశానికి చేరి కూర్చున్నాయి. రెండు నెలల క్రితం బంగారం ధరలు కాస్త తగ్గినా, మళ్లీ జోరు మీదున్నాయి. ఓవైపు షేర్ మార్కెట్ ఒడిదుడుకుల్లో కొనసాగుతోంది. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బంగారం ధరలు ఇప్పట్లో తగ్గే అవకాశం కనిపించడం లేదు. ప్రస్తుతం బంగారం ధరలు ఆల్‌టైం హైలో కొనసాగుతున్నాయి. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం రూ.61 వేలు మార్కును చేరుకుంది. ఇదే జోరు కొనసాగితే రూ.70 వేలను కూడా దాటేస్తుందని అంచనా వేస్తున్నారు. నిలకడగా ఉన్న బంగారం ధరలు ఇంకా తగ్గుతాయని కొన్ని నెలలుగా బులియన్ వర్గాలు విశ్లేషిస్తూ వస్తున్నాయి. అయితే వారి అంచనాలను తలకిందులు చేస్తూ ఇప్పుడు బంగారం ధరలు కొండెక్కి కూర్చున్నాయి. మరోవైపు వెండి ధర కూడా పెరుగుతోంది. ప్రస్తుతం వెండి కిలో రూ.72 వేల వద్ద ట్రేడవుతోంది. ముంబై మార్కెట్ ధర ఆధారంగా నరసాపురం బులియన్ వ్యాపారం జరుగుతుంది. మంగళవారం నరసాపురం మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.61 వేలు, 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర 10 గ్రాములు రూ.56,500లుగా ఉంది. 916 కేడీఎం ఆభరణాల బంగారం కాసు ధర ప్రస్తుతం రూ.45,200లకు చేరింది.

దుకాణాలు వెలవెల

దసరా, దీపావళి పండుగల రోజుల్లో బంగారం అమ్మకాలు జోరుగా సాగుతాయి. ఇక క్రిస్మస్, సంక్రాంతి పండుగలు కూడా సమీపంలో ఉండటం, మరోవైపు పెళ్లిళ్ల సీజన్ కూడా మొదలవడంతో బంగారం ధరల పెరుగుదల అమ్మకాలపై ప్రభావం చూపింది. దీంతో మొన్నటివరకు కళకళలాడిన జ్యూయలరీ షాపులు ప్రస్తుత సీజన్‌లో కూడా వెలవెలబోతున్నాయి. ఒక్క నరసాపురం మార్కెట్‌లోనే హోల్‌సేల్, రిటైల్ కలిపి రోజుకు రూ.3 కోట్ల వరకు బంగారం అమ్మకాలు జరుగుతాయి. ఉమ్మడి పశ్చిమలోని ఏలూరు, తణుకు, తాడేపల్లిగూడెం, భీమవరం పట్టణాల్లో పెద్ద ఎత్తున అమ్మకాలు జరుగుతాయి. పెరిగిన ధరలతో జిల్లాలో రోజుకు రూ.2 కోట్ల వరకూ అమ్మకాలు తగ్గినట్టుగా అంచనా. దాదాపు 30 శాతం అమ్మకాలు తగ్గిపోయాయయని బులియన్ వర్తకులు చెబుతున్నారు.

పాత బంగారం మార్పిడిపై ఆసక్తి

బంగారం ధర భారీగా పెరగడంతో ఆభరణాల అమ్మకాలు పడిపోయాయి. పెళ్లిళ్ల వంటి సామాజిక అవసరాలకు బంగారం కొనేవారు కూడా వాయిదాలు వేసుకుంటున్నారు. పెట్టుబడిగా కొనే బిస్కెట్ అమ్మకాలు మాత్రం కాస్త బాగానే సాగుతున్నాయని చెబుతున్నారు. ఇక పాత బంగారం మార్పిడి జోష్ అన్ని పట్టణాల్లో కొనసాగుతోంది. ధర రూ.61 వేలకు చేరడంతో పాతబంగారం మార్పిడికి ఇదే అదునుగా కొనుగోలుదారులు భావిస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న అమ్మకాల్లో 50 శాతం వాటా పాత బంగారం మార్పిడితోనే జరుగుతోంది.

ధర ఇంకా పెరగొచ్చు



బంగారం ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉంది. ఒకవేళ తగ్గినా పెద్దగా తగ్గకపోవచ్చు. ఇజ్రాయెల్ యుద్ధం ప్రభావం ఎక్కువగా ఉంది. ఏదిఏమైనా బంగారం ధరలను అంచనా వేయలేకపోతున్నాం. ప్రస్తుతం 30 శాతం అమ్మకాలు తగ్గాయి. నగదుతో ఎవరూ బంగారం కొనుగోళ్లు చేయడం లేదు. పాత బంగారం మార్చుకుని కొత్త వస్తువులు ఆర్డర్లు ఇస్తున్నారు. ప్రస్తుతం ఇదే వ్యాపారం ఎక్కువగా సాగుతోంది.

– వినోద్‌కుమార్ జైన్, అధ్యక్షుడు, నరసాపురం బులియన్ మర్చంట్స్ అసోసియేషన్

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ నేత శౌంరి చేరిక


శౌంరికి గజమాల వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ

కైకలూరు: రాష్ట్ర పురోభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనితీరు నచ్చి ఇతర పార్టీల నేతలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారు. కైకలూరు సీఎన్నార్ గార్డెన్‌లో మండవల్లి మండలం కానుకొల్లు గ్రామానికి చెందిన టీడీపీ నేత, గౌడ సంఘ నాయకుడు శౌంరి కుమారస్వామి మంగళవారం ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ సమక్షంలో పార్టీలో చేరారు. ఆయనతో పాటు మరో 10 మంది అనుచరులకు పార్టీ కండవాలు కప్పి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఆహ్వానించారు. శౌంరి కుమారస్వామి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేస్తానని చెప్పారు. కానుకొల్లు సర్పంచ్ నాగదాసి థామస్, నాయకులు పుట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యులు ముంగర విజయనిర్మల, ఎమ్మెల్యే డీఎన్నార్ కుమారులు దూలం వినయ్, శ్యామ్, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, నాయకులు సయ్యపురాజు గుర్రాజు, చేబోయిన వీర్రాజు, బేతపూడి ఏసోబురాజు, మండవల్లి మండల సర్పంచ్లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ తాపీ కూలీ మృతి

ఉండి: పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ తాపీ కూలీ చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మహదేవపట్నంకు చెందిన కడిమి వెంకటేష్ (38) తాపీ పనులకు వెళుతుండగా, ఇతని భార్య భీమవరంలోని ఓ స్వీట్ షాపులో పనిచేస్తోంది. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఏమైందో ఏమో తెలియదు గానీ కొద్ది రోజులుగా వెంకటేష్ ముభావంగా ఉంటూ ఎవరితో మాట్లాడలేదు. ఈ క్రమంలో ఈ నెల 12న తాపీ పనికి వెళ్లగా, భార్య స్వీట్ షాపునకు వెళ్లింది. అయితే 11 గంటల సమయంలో వెంకటేష్ పురుగుమందు తాగి ఇంటికి వచ్చి వాంతులు చేసుకుంటున్నాడు. ఇది గమనించిన కుమారుడు తల్లికి ఫోన్ చేసి విషయం చెప్పాడు. ఆమె వెంటనే వచ్చి స్థానిక ఆర్‌ఎంపీ వద్దకు, అక్కడ నుంచి భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై ఎ.సూర్యనారాయణ చెప్పారు.

టీటీలో అచ్యుత్‌కు కాంస్యం

ఏలూరు రూరల్: రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో ఏలూరుకు చెందిన ఎస్.అచ్యుత్ కాంస్య పతకం సాధించాడని శాప్ కోచ్ ఘంటా శేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు అనంతపురంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో అండర్–11 విభాగంలో అచ్యుత్ ప్రతిభ చూపి పతకం సాధించాడన్నారు. అచ్యుత్‌ను జిల్లా చీఫ్ కోచ్ బి.శ్రీనివాసరావు, సెట్‌వెల్ సీఈఓ ఎండీహెచ్ మెహర్రాజ్ అభినందించారు.

ఉప్పొంగిన అభిమానం.. వినూత్న ప్రచారం


నాగన్నగూడెంలో వైఎస్సార్‌సీపీ జెండా దుస్తులతో సైకిల్‌పై ప్రచారానికి వెళుతున్న సోమయ్య

పెదవేగి: నాగన్నగూడెం గ్రామానికి చెందిన సొంగ సోమయ్య అనే వ్యక్తి వైఎస్సార్ సీపీకి వీరాభిమాని. మహానేత వైఎస్సార్‌పై అభిమానంతో ఉండేవాడు. అనంతరం ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కూడా అదే మక్కువను ప్రదర్శిస్తున్నాడు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ జెండా రంగుల్లో దుస్తులను కుట్టించుకుని వాటిని ధరించి ప్రచారం చేయగా, అప్పట్లో వార్తల్లో నిలిచిన విషయం విదితమే. అలాగే ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా దుస్తులను ధరించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఎండను సైతం లెక్కచేయకుండా సైకిల్‌పై ప్రచారం చేస్తున్నాడు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలు తిరుగుతూ సీఎం వైఎస్ జగన్ చేస్తున్న అభివృద్ధిని చాటిచెబుతానని సోమయ్య అంటున్నాడు. 2024లో కూడా విజయం సాధించి పేదలకు మరింత అండగా వైఎస్ జగన్ నిలుస్తారని సోమయ్య ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర పోటీలకు గోయెంకా విద్యార్థి

పెంటపాడు: రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు తమ కళాశాల విద్యార్థి ఎంపికైనట్లు పెంటపాడు డీఆర్ గోయెంకా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు మంగళవారం చెప్పారు. తమ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న జె.అశోక్ చదువుతో పాటు, క్రీడలలో రాణిస్తున్నాడన్నారు. ఈ నెల 15న చాగల్లులో రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహించగా, వాటిలో పాల్గొని ప్రతిభ కనపరిచి ఎంపికయ్యాడన్నారు. విద్యార్థిని మంగళవారం కళాశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రత్యేకంగా అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ బ్రహ్మచారి, కామర్స్ విభాగాధిపతి ప్రసాద్, ఎకనామిక్స్ విభాగాధిపతి విజయబాబు, పీడీ అజ్జీబాబు పాల్గొన్నారు.

వ్యాపారం పేరుతో సొమ్ము కాజేత

భీమవరం అర్బన్: వ్యాపారం చేద్దామని చెప్పి సొమ్ము కాజేసిన వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఎల్‌వీఎన్ పురం గ్రామానికి చెందిన కొల్లాటి శ్రీను వద్ద నుంచి యనమదుర్రు గ్రామానికి గంధం గణేష్, అతని ఇద్దరు సోదరులు రూ.2.50 లక్షల నగదు, 4.5 కాసుల బంగారం, మహీంద్ర పికప్ వాహనాన్ని వ్యాపారం చేద్దామని నమ్మించి తీసుకుని తిరిగి ఇవ్వలేదు. దీంతో బాధితుడు కొల్లాటి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు హెచ్‌సీ పి.మహేశ్వరరావు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గడపగడపకు సంక్షేమం


ఏలూరు టౌన్: ఏలూరు 34వ డివిజన్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని


లింగపాలెం: కలరాయునగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ కుటుంబానికి అందిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వ పాలన

ఏపీ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని


శ్రీవారి ఆలయంలో కొమ్మినేనికి స్వామివారి మెమెంటో అందజేస్తున్న ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందని ఏపీ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. శ్రీవారి దర్శనానంతరం కొండపైన అతిథి గృహంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలోని ఏ రాష్ట్రంలోను లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు అనేక సంక్షేమ ఫలాలను అందిస్తోందన్నారు. అనంతపురం నుంచి శ్రీకాకుళం వరకు తాను పర్యటిస్తున్నానని, ప్రతి జిల్లాలో ఏదో ఒక అభివృద్ధి కార్యక్రమం జరుగుతోందన్నారు. మచిలీపట్నం నుంచి కాకినాడ వరకు సముద్రతీర ప్రాంతాల అభివృద్ధిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. రాష్ట్రంలో ఓడరేవుల అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, అందులో భాగంగా రామాయపటంలో ఓడరేవు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. అదేవిధంగా సుమారు 9 ఫిషింగ్ హార్బర్లు నిర్మాణంలో ఉన్నట్టు చెప్పారు. రాష్ట్రంలో పేదలకు అనేక వైద్య సేవలను అందించడమే కాకుండా ఇటీవల ఐదు ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రారంభించడం జరిగిందన్నారు. త్వరలో మరో ఐదు మెడికల్ కళాశాలలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. విశాఖపట్టణాన్ని ఐటీ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు సీఎం కృషి చేస్తున్నారన్నారు. రూ.3 కోట్లతో ఐటీ కాంప్లెక్స్ ఏర్పాటు, అలాగే అనేక రకాల పరిశ్రమలను నెలకొల్పడం ప్రభుత్వ ధ్యేయమన్నారు. రామయ్యపేటలో రూ.40 వేల కోట్లతో సోలార్ ప్రాజెక్ట్ నిర్మించడం వల్ల నెల్లూరు నుంచి గుంటూరు వరకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లోనూ వేగం పుంజుకుని పరుగులు తీస్తోందన్నారు. పేదలకు అందిస్తున్న సంక్షేమ ఫలాలు శాశ్వతంగా అందాలంటే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ప్రజలంతా ఆశీర్వదించాలన్నారు. తొలుత చినవెంకన్న ఆలయాన్ని ఏపీ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు సతీసమేతంగా సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవస్థానం అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, దేవస్థానం ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు స్వామివారి మెమెంటో, ప్రసాదాలను అందజేశారు. ఓఎస్డీ ఎస్.శ్రీనివాస్ జీవన్ తదితరులున్నారు.

హ్యాండ్‌బాల్‌లో సత్తా చాటిన పశ్చిమ జట్లు


సాధించిన కప్‌ను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు చూపుతున్న క్రీడాకారిణులు


బాలుర జట్టును అభినందిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు రూరల్/ ఏలూరు (మెట్రో): కడపలోని డీఎస్ఏ స్టేడియంలో ఈ నెల 14, 15, 16 తేదీల్లో జరిగిన హ్యాండ్‌బాల్ రాష్ట్ర పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి సీనియర్ మహిళల జట్లు, బాలుర జట్లు సత్తా చాటి చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నాయి. అంతేకాక ఈ జట్లలో క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఏలూరులో తనను కలిసిన ఇరు జట్ల క్రీడాకారులను మంగళవారం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అభినందించారు. వివరాల్లోకి వెళితే.. కడపలో సోమవారం సాయంత్రం జరిగిన మహిళల ఫైనల్స్‌లో ఉమ్మడి పశ్చిమ జట్టు కృష్ణా జట్టుపై 15–7 గోల్స్‌తో విజయం సాధించి విజేతగా నిలిచింది. అలాగే బాలుర జట్టు ఫైనల్‌లో చిత్తూరు జట్టుపై 21–15 స్కోర్‌తో గెలిచి ట్రోఫీ అందుకుంది. కర్నూల్ మహిళల జట్టు, విజయనగరం బాలుర జట్టు మూడో స్థానంలో నిలిచాయి. పోటీల్లో ప్రతిభ చాటిన జిల్లా క్రీడాకారులను సెలెక్షన్ కమిటీ సభ్యులు రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారని జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు వై.లక్ష్మీనారాయణ, కార్యదర్శి కె.అలివేలు వెల్లడించారు. బాలుర విభాగంలో కె.ప్రభుదేవ, డి.ప్రశాంత్, ఎ.శ్రీరామ్‌యాదవ్, ఎ.సుభాని, మహిళల విభాగంలో డి.రాఖీ, డి.స్వాతి, పుణ్య, ఉమామహేశ్వరి, దుర్గారాణి, జెస్సీ ఉన్నారు. నవంబర్‌లో జరిగే జాతీయ పోటీల్లో వీరు పాల్గొంటారని చెప్పారు.

మహీంద్రా షోరూమ్ ప్రారంభం


ట్రాక్టర్ కీని అందజేస్తున్న యాజమాన్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏలూరులో మహీంద్రా ట్రాక్టర్స్ డీలర్‌గా సేవలందిస్తున్న నేరెళ్ల రాజా ఆటోమొబైల్స్ మంగళవారం తాడేపల్లిగూడెం తమ నూతన షోరూమ్‌ను ప్రారంభించింది. మెగా డెలివరీ మేళా నిర్వహించి రైతులకు ట్రాక్టర్లు అందజేసింది. లక్కీడిప్‌లో గెలుపొందిన విజేతలకు బైక్ తదితర బహుమతులను నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీలర్ నేరెళ్ల రవి అండ్ సన్స్, మేనేజర్లు రతన్‌చంద్, రామకృష్ణ, బాలచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

2 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత


పెదవేగిలో పట్టుబడిన వాహనంతో విజిలెన్స్ అధికారులు

పెదవేగి: వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న రెండు టన్నుల రేషన్ బియ్యాన్ని మంగళవారం రాత్రి విజిలెన్స్ అధికారులు పట్టివేశారు. విజిలెన్స్ ఎస్పీ కరణం కుమార్‌కు అందిన సమాచారంతో ఆయన ఆదేశాల మేరకు పెదవేగి పీహెచ్‌సీ సమీపంలో విజిలెన్స్, పౌరసరఫరాల అధికారుల తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో కూచింపూడి నుంచి అక్రమంగా వ్యాన్‌లో తరలిస్తున్న రెండు టన్నుల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు గుర్తించి బియ్యం, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. సరుకు యజమాని కూచింపూడికి చెందిన ఉప్పల ప్రకాష్, డ్రైవర్ గిత్త శివలపై కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ రూ.80 వేలు ఉంటుంది. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ యూజే విల్సన్, సివిల్ సప్లయిస్ డీటీ ఎ.ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని మనస్తాపంతో..

టి.నరసాపురం: భార్య పుట్టింటికి వెళ్లిపోయిందనే మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. వీరభద్రవరానికి చెందిన నల్లజర్ల వేములయ్య, భార్య వెంకటేశులు మధ్య కుటుంబ కలహాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఈ నెల 14న ఇద్దరూ గొడవపడ్డారు. విషయం తెలుసుకున్న వేములయ్య తండ్రి సోమనాద్రి వారికి సర్దిచెప్పాడు. అయితే వెంకటేశులు 15న జంగారెడ్డిగూడెంలోని పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన వేములయ్య 16న పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అతనిని వెంటనే స్థానిక ఆస్పత్రికి అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఏలూరు తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. సోమనాద్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.సురేంద్రకుమార్ చెప్పారు.